సాక్షి
ఒడిశా
సోమవారం । 27 । జనవరి । 2025


శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 8,79,055
బంగారం : 6 గ్రాముల 850 మిల్లీ గ్రాములు
వెండి : 136 గ్రాములు
– భువనేశ్వర్/పూరీ


దట్టంగా పొగమంచు
పర్లాకిమిడిలో పొగమంచు కమ్ముకుంటోంది. జనం ఇబ్బంది పడుతున్నారు.
- 8లో

వరుస దొంగతనాలు
కలిమెల సమితిలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. జనం ఆందోళన చెందుతున్నారు.
- 8లో


న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవంలో ముఖ్యమంత్రి



భువనేశ్వర్: కటక్ బిడానాసి మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి 76వ గణతంత్ర దినోత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు వర్గాల గౌరవ కవాతు స్వీకరించారు.

నకిలీ విదేశీ మద్యం కేసులో ప్రధాన నిందితుని అరెస్టు


అబ్కారీ శాఖ అధికారులతో నిందితుడు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుమడలో నకిలీ విదేశీ మద్యం తయారీ, అమ్మకాల కేసులో ప్రధాన సూత్రధారిని అబ్కారీ మొబైల్ బృందం శనివారం సాయంత్రం స్థానిక రైతుల కాలనీలో అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తిని లక్ష్మీనారాయణ సాహుకారిగా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 11వ తేదీన అబ్కారీ శాఖ అధికారులు గుమడలో నకిలీ విదేశీ మద్యం అమ్మకాలు, తయారీకి సంబంధించి విశ్వసనీయ సూత్రాల ద్వారా లభించిన సమాచారం మేరకు ఒక ఇంటిలో దాడి చేశారు. ఈ దాడిలో నకిలీ విదేశీ మద్యం బాటిళ్లతో పాటు మూతలు తదితరమైనవి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అసలు సూత్రధారిని పట్టుకునే ప్రయత్నంలో దర్యాప్తు చేసిన అబ్కారీ శాఖ అధికారులు సాహుకారును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ


వృద్ధులకు రగ్గులు అందజేస్తున్న అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి ధనిగూఢ గ్రామంలో సమాజ్ దినపత్రిక తరఫున వృద్ధులకు ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవిందపాత్రో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం ఏర్పాటైన సమాజ్ పత్రిక విశేషాలను వివరించారు. పత్రిక వ్యవస్థాపకులు గొప్పబంధ్ దాసు ఒడిశా రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమాజ్ దినపత్రిక జిల్లా ప్రతినిధి డి.గోపీకృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.


రగ్గులు అందుకున్న ఆనందంలో వృద్ధ దంపతులు


కొరాపుట్: జెండా ఎగుర వేస్తున్న కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్త గిరి ఉల్క


నబరంగ్‌పూర్‌లో జెండా ఎగుర వేస్తున్న రవాణా మంత్రి బిభుతి భూషణ్ జెన్నా


వివిధ వర్గాల కవాతు స్వీకరించిన గవర్నర్

వైభవంగా.. గణతంత్ర దినోత్సవం


సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థుల దేశభక్తి నృత్యం


పర్లాకిమిడి: పరేడ్‌లో దళాల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ,డీఎస్పీ

భువనేశ్వర్: స్థానిక గాంధీ మార్గ్‌లో రాష్ట్ర స్థాయి 76వ గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరించారు. జార్ఖండ్ పోలీసులు కూడా కవాతులో పాల్గొన్నారు. 120వ బెటాలియన్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఆర్పీఎఫ్, సీఆర్పీఎఫ్ బ్యాండ్, భువనేశ్వర్ ఎస్ ఎస్ బీఎస్, ఎస్ఓజీ చందకా, జార్ఖండ్ పోలీస్, ఓఐఎస్ఎఫ్, అమర్డ్ పోలీస్, కమిషనరేట్ ట్రాఫిక్ పోలీస్, కటక్ ఓఎస్ఎఫ్, ఒడ్రాఫ్, ఓఐఎస్ఎఫ్, ఫైర్, హోంగార్డ్, విద్యార్థుల కవాతును గవర్నరు స్వీకరించారు. ఈ ప్రదర్శనలో 49 కంటింజెంట్లు కవాతు నిర్వహించారు. స్థానిక మహర్షి కాలేజ్ ఆఫ్ నేచురల్ లా విద్యార్థులు బైక్ పై ప్రదర్శించిన డేర్ డెవిల్స్ విన్యాసాలు గగుర్పొడిచాయి. ఒడిశా స్కేటింగ్ అకాడమీ అభ్యర్థుల స్కేటింగ్ విన్యాసాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి. రాయగడకు చెందిన ధిమ్సా, కెంఝుహర్ గిరిజన నృత్యం, కొయ్య గుర్రం నృత్యం, శివ తాండవం మరియు ఆర్యన్ రాయల్ స్కేటింగ్ స్పోర్ట్సు అకాడమీ విద్యార్థులు అఘోరీ నృత్యాలు ప్రదర్శించారు. ఆ తర్వాత ప్రకటన శకటాల తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జెండాను ఎగురవేసిన సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు.

కొరాపుట్‌లో

కొరాపుట్: గణతంత్ర దినోత్సవం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ఘనంగా జరిగింది. కొరాపుట్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర రవాణ శాఖ మంత్రి బిభుతి భూషణ్ జెన్నలు జెండా ఎగురవేశారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని డీఎన్‌కే క్రీడా మైదానంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర మత్స్యశాఖ, వన్యప్రాణుల శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ హాజరై జెండా ఎగురవేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, ఎస్పీ వినోధ్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కామి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టాంగులు, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో..

జయపురం: స్థానిక విక్రమ క్రీడా మైదానంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి ఎగురవేశారు. మన రాజ్యాంగం సర్వోన్నతమైనదని ప్రజలకు సమాన హక్కులు కల్పించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్ విచ్చేసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మూడో ఆర్మ్‌డ్ బెటాలియన్ కమండర్ నిరంజన్ నాయక్ గౌరవ వందనాన్ని కలెక్టర్, ఎస్పీ స్వీకరించారు. ఆర్.ఉదయగిరి ఛెలిగడ జలవిద్యుత్ ప్రాజెక్టు అతి త్వరలో ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి


మల్కన్‌గిరి: బోండా నృత్యం


జయపురం: జాతీయ పతాకాన్ని ఎగురవేసిన సబ్ కలెక్టర్ శొశ్యారెడ్డి


జయపురం: గణతంత్ర వేడుకలు తిలకిస్తున్న రష్యా దేశీయులు


గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ ప్రకటన శకటం


మహర్షి కాలేజ్ ఆఫ్ నేచురల్ లా విద్యార్థుల డేర్ డెవిల్స్ విన్యాసాల ప్రదర్శన


మల్కన్‌గిరి: గౌరవ వందనం అందుకున్న మంత్రి గోకులానంద మల్లిక్


గంజాం జిల్లా కొయ్య గుర్రం నృత్య ప్రదర్శన






కెంఝుహర్ గిరిజన నృత్యం


సంబల్‌పురి నృత్య ప్రదర్శన


ధింసా నృత్య ప్రదర్శన

గణతంత్ర దినోత్సవంలో అపశృతి




బాధిత విద్యార్థులను పరామర్శించిన విద్యా విభాగం ప్రముఖ కార్యదర్శి షాలిని పండిత్



భువనేశ్వర్: కటక్ జిల్లా బంకీ ప్రాంతంలో గణతంత్ర దినోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. బంకి మలవిహార్ పూర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గణతంత్ర వేడుకల కోసం విద్యార్థులను తరలిస్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఒక విద్యార్థి మృతి చెందగా పలువురు గాయపడ్డారు. మృతుడు పదో తరగతి విద్యార్థి. మలవిహార్ పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు అంశుపా సరస్సు సమీపంలోని సరంద పరేడ్ గ్రౌండ్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స నిమిత్తం అఠాగొడా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారిలో తొమ్మిది మంది పరిస్థితి విషమించడంతో కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం ప్రముఖ కార్యదర్శి ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థుల్ని ప్రత్యక్షంగా కలిసి పరామర్శించి ఆరోగ్య బాగోగుల్ని తెలుసుకున్నారు.

29 మందికి పోలీసు పతకాల ప్రదానం


పోలీసు పతకం విజేతలతో రాష్ట్ర గవర్నర్


పోలీసు పతకాలు ప్రదానం చేసిన గవర్నర్


పోలీసు పతకాల ప్రదానోత్సవానికి హాజరైన ఉన్నతాధికారులు

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి రాష్ట్ర పోలీసు సిబ్బందికి హోం శాఖ ప్రకటించిన పతకాలను ప్రదానం చేశారు. వివిధ వర్గాల కింద విశిష్ట సేవలు అందించిన 29 మంది సిబ్బందికి పోలీసు పతకాలను ప్రదానం చేశారు. వీరిలో 6 మందికి పోలీసు శౌర్య పతకం, 2 మందికి రాష్ట్రపతి విశిష్ట పతకాలు, అగ్నిమాపక విభాగం నుంచి ఒకరికి, హోంగార్డు, సివిల్ డిఫెన్స్‌కు చెందిన ఇద్దరికి గవర్నర్ పతకాలు ప్రదానం చేశారు. వీరితో మరో 11 మంది సిబ్బంది, 4 మంది అగ్నిమాపకం, ఒక హోం గార్డు, సివిల్ డిఫెన్స్‌లో 2 మంది దిద్దుబాటు విభాగం సిబ్బందికి మెరిటోరియస్ సర్వీస్ (పోలీస్) పతకాలను అందించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వై. బి. ఖురానియా, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అశోక్ పారిడా



అశోక్ పారిడాకు అభినందలు తెలియజేస్తున్న మంత్రి గోకులనందన్

మల్కన్‌గిరి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శనివారం రాత్రి అశోక్ పారిడా పేరును రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి గోకులనందన్ వెల్లడించారు. జిల్లా అధ్యక్ష పదవి కాలం పూర్తయిన సందర్భంగా కొత్తగా పార్టీ కార్యాలయానికి నిమాయి చంద్రపాల్, భవానీ శంకర్ ముఖర్జీ, అశోక్ పారిడా పేర్లు పంపారు. అశోక్‌ను పార్టీ ఎంపిక చేసినట్లు జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తెలిపారు, అశోక్‌కు మంత్రి అభినందనలు తెలియజేశారు.

వరుస దొంగతనాలు



లూటీకి గురైన ఏటీఎం

మల్కన్‌గిరి: జిల్లా కలిమెల సమితి కేంద్రంలో శనివారం రాత్రి వరుస దొంగతనాలు జరిగాయి. కలిమెల సమితి కార్యాలయానికి కేవలం 500 మీటర్ల దూరంలో స్టేట్ బ్యాంక్ ఏటీఎం మిషన్‌ను పగలుగొట్టారు. ఎదురుగా ఉన్న కంప్యూటర్ దుకాణంలో చోరీ చేశారు. మరో ముబైల్ షాప్ తాళాలు పగలుగొట్టి ఫోన్లు దోచుకున్నారు. ఆదివారం ఉదయం స్థానికులు చూసి వెంటనే షాప్‌ల యజమానులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండి చేరుకుని ఏటీఎం, షాపుల్లో సీసీ ఫుటేజ్‌లు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంలో నగదు ఉందా, లేదా అనే విషయం బ్యాంక్ వారి ద్వారా తెలుసుకుంటామన్నారు.





రాయగడ: విద్యార్థుల విన్యాసాలు



రాయగడ: గుణుపూర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్‌కౌర్

వైద్యరంగానికి పెద్దపీట

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి మహాలింగ్

రాయగడ: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా బీజేపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ అన్నారు. ఇందులో భాగంగా వైద్య రంగానికి పెద్ద పీట వేసి దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వైద్యరంగం కొత్త పుంతలు తొక్కేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందరికీ మెరుగైన వైద్యంతో పాటు ప్రతీ ఆస్పత్రిలో ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించే విధంగా కృషి చేస్తున్నామని వివరించారు. కొత్తగా వైద్యుల నియామకాన్ని చేపట్టనున్నట్టు ప్రకటించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడలు, విన్యాసాలు ప్రదర్శించారు. ప్రప్రథమంగా ఐటీడీఏ సంస్థ శకటాన్ని ప్రదర్శనలో ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, ఇతర అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గుణుపూర్‌లో..

జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌరన్ సహోట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్



బ్యాటింగ్ చేస్తున్న విలేకరుల బృందం సభ్యులు



కప్ గెలుపొందిన జిల్లా యంత్రాంగం జట్టు

పర్లాకిమిడి: స్థానిక క్రిష్ణచంద్ర గజపతి కళాశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒన్‌డే ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో జిల్లా మినిస్టీరియల్ సిబ్బంది వర్సెస్ జిల్లా విలేకరుల బృందం ఆదివారం మధ్యాహ్నం ఆడారు. తొలుత టాస్‌గెలిచిన ఫారెస్టుఫైర్ (జిల్లా యంత్రాంగం) టీం బ్యాటింగ్‌ను ఎంచుకున్నారు. నిర్ణీత 15 ఓవర్లలో ఫారెస్టు ఫైర్ బృందం 164 పరుగులు చేసి అయిదు వికెట్లు కోల్పోయారు. 165 స్కోరింగ్ లక్ష్యంగా విలేకరుల బృందం తదుపరి బ్యాంటింగ్‌లో దిగి 15 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 113 పరుగులు తీశారు. ఈ ఉత్కంఠ మ్యాచ్‌లో ఫారెస్టు ఫైర్ జట్టు సంతోష్‌కుమార్ మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా నిలవగా, మీడియా బృందం రన్నర్స్‌గా మిగిలారు. ఫారెస్టుఫైర్ జట్టుకు కెప్టెన్‌గా ఎ.డి.ఎం, రాజంద్ర మింజ్, వికెట్ కీపర్‌గా సబ్ కలెక్టర్ అనుప్ పండా, కలెక్టర్ కూడా ఫీల్డులో దిగి జట్టును గెలిపించుకున్నారు. చివరకు బహుమతి ప్రదానోత్సవంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారెస్టు ఫైర్ జట్టు వైల్డ్‌ఫైర్ తమ ఆటలో సత్తా చూపారని అన్నారు. ఈ ఆటను వీక్షించిందుకు డి.ఎఫ్.ఓ. యస్.ఆనంద్, డి.ఆర్.డి.ఎ. అధికారి గుణనిధి నాయక్, డెప్యూటీ కలెక్టర్ లిపినా బెహరా తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న అధికార టీం కెప్టెన్, ఏడీఎం రాజేంద్ర మింజ్



రన్నర్స్‌గా నిలిచిన విలేకరుల టీం



కలెక్టర్, ఏడీఎం, మినిస్టీరియల్ సిబ్బంది జట్టు

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత కేవీఆర్ భువనేశ్వర్



హోరాహోరీగా తలపడుతున్న పాంథర్స్, బోలర్స్ జట్లు

పర్లాకిమిడి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గజపతి జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. శివప్రసాద్ ప్రదాన్(దిప్పు) స్మారక బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగింది. తొలి ఫైనల్ మ్యాచ్‌లో పాంథర్స్ వెర్సస్ బోలర్స్ జట్టు ఆడగా పాంథర్స్ గెలిపొందారు. రెండో ఫైనల్‌లో కె.వి.ఆర్. (పర్లాకిమిడి) వెర్సస్ యువ (భువనేశ్వర్) జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. భువనేశ్వర్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను తిలకించడానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేశారు.

దట్టంగా పొగమంచు..



రాజావారి ప్యాలస్‌పై కురుస్తున్న పొగమంచు

పట్టణంలో ఆదివారం దట్టంగా పొగమంచు కురవడంతో రాజావారి ప్యాలస్ కొన్ని గంటలు కనబడకుండా పోయింది. ఘాట్ సెక్షన్‌లో పొగమంచు కారణంగా వాహనాలు లైట్లు వేసుకుని నడిపారు. – పర్లాకిమిడి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



కార్యకర్తలకు ధైర్యం చెబుతున్న పేరాడ తిలక్

టెక్కలి: టీడీపీ కార్యకర్తల చేతిలో అక్రమ కేసులకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని.. ప్రతీ ఒక్కరికీ అండగా నిలబడి న్యాయస్థానంలో పోరాటం చేస్తానని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ భరోసా ఇచ్చారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామంలో అక్రమ కేసులకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామ సర్పంచ్ అంగ లక్ష్మితో పాటు నాయకులు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ పాలనలో టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయం నిర్మాణానికి రూ.. 15 లక్షలు మంజూరు చేశారన్నారు. సుమారు రూ. తొమ్మిది లక్షల ఖర్చుతో నిర్మాణం పనులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు అండతో బిల్లులు నిలిపి వేయడమే కాకుండా పనులు సైతం ఆక్రమించుకున్నారని వాపోయారు. అంతే కాకుండా గతంలో జరిగిన చిన్నపాటి తగాదాపై ఫిర్యాదులు చేసి 12 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేయించారన్నారు. గ్రామంలో భగవంతునితో సైతం రాజకీయాలు చేస్తున్నారని వారంతా తిలక్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలు పోలీసులతో నమోదు చేయిస్తున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దని ధైర్యం చెప్పారు. అక్రమ కేసులు, అరెస్టులకు గురైన ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా నిలబడి న్యాయ స్థానంలో పోరాటం చేస్తానన్నారు. అలాగే సంక్షేమ పథకాల విషయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నవారికి ఎవరికైనా పింఛన్లు ఆపివేయడం, ఇతర సంక్షేమ పథకాలు నిలిపి వేయడం చేస్తే తక్షణమే తనకు తెలియజేయాలన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు, అరాచకాలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్ అంగ లక్ష్మి, నాయకులు ఎ.జనార్ధనరావు, వి.సింహాచలం, ఎ.ప్రసాద్, ఎ.మల్లేష్‌తో పాటు పార్టీ జిల్లా నాయకులు డి.కృష్ణారావు ఉన్నారు.

మోక్షమెప్పుడో?

- పాలకుల ప్రచారం అస్త్రంగా కడపలవాని గెడ్డ
- రైతులకు ఊరిస్తున్న బ్రిడ్జి నిర్మాణం
- 25 ఏళ్లకుపైగా హామీలతోనే సరి..
- 3 వేల ఎకరాలకు తప్పని వరద ముంపు



కడపలవానిగెడ్డపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట–దబ్బపాడు గ్రామాల మధ్య కడపలవానిగెడ్డ ఉంది. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు పంట పొలాల్లో నుంచి ప్రవహిస్తూ వచ్చి ఈ గెడ్డ ద్వారా వంశధార నదిలోకి వెళ్తుంది. కొద్దిపాటి వర్షం కురిసినా కడపలవానిగెడ్డకు వరద నీరు పోటెత్తుతుంది. వరదనీరు కారణంగా సుమారు 3 వేల ఎకరాల పంట భూములు నీట మునిగిపోతాయి. వంశధార నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటే వరదనీరు రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. నదిలో వరద ఎక్కువగా ఉంటే పది, పదిహేను రోజులు వరద నీరు పొలాల్లోనే ఉంటుంది. గెడ్డపై నీటి ప్రవాహం ఎక్కువుగా ఉంటే రాకపోకలు నిలిచిపోతాయి. గెడ్డకు అవల ఉన్న వాడవలస, దబ్బపాడు గ్రామాలకు చెందిన ప్రజలు తురకపేట సెంటర్‌కు వచ్చేందుకు ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

1999 నుంచి హామీలతోనే సరి..

కడపలవానిగెడ్డ సమస్యకు మోక్షం కలిగిస్తామని ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు 1999 నుంచి గెడ్డకు వచ్చిన వరదల్లోనే కొట్టుకు పోతున్నాయి. రోడ్డుపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో నేతలు ఇచ్చిన హామీలు రైతులతోపాటు ఈ ప్రాంత ప్రజలకు ఊరిస్తునే ఉన్నాయి. 1999లో చంద్రబాబు పాలనలో ఉన్న మంత్రులు, ఈ తరువాత గెలిచిన ఎమ్మెల్యేలు, 2009 ఎన్నికల్లో గెలిచి ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన శత్రుచర్ల విజయరామ రాజు, 2014లో గెలిచిన ఎమ్మెల్యే కలమట వెంకట రమణ, జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమ, ఉప ముఖ్యమంత్రి చిన్నరాజప్ప ఇలా ఎంతో మంది కడపలవానిగెడ్డకు మోక్షం కలిగిస్తామని, ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు.

ఏం చేయాలంటే..

కడపలవానిగెడ్డ మూడు కిలో మీటర్ల మేర ఉంది. సుమారు 15 నుంచి 20 మీటర్ల వెడల్పుతో ఉన్న గెడ్డలో ఆక్రమణలు పెరిగిపోవడం వలన వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతుంది. గెడ్డ నుంచి వెళ్లే వరద నీరు వంశధార నదిలో కలిసే ప్రాంతంలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. గెడ్డలో పూడికలతోపాటు ఆక్రమణలు తొలగించాలి. తురకపేట వద్ద గెడ్డపై వంతెన నిర్మాణం పనులు చేపట్టి ఎత్తు పెంచాలి. ఇలా చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది.

నష్టపోయే గ్రామాలివే..

కడపలవానిగెడ్డకు వరదనీరు పోటెత్తినప్పుడు తురకపేట, దబ్బపాడు, కృష్ణాపురం, సుమంతాపురం, వాడవలస, మిరియాపల్లి, సీతారాంపురం, చిట్టి మండలం, ధనుకువాడ, నరేంద్రపురం, సోమనాథపురం, కోవిలాం, రావిచెంద్రి, చింతలబడవంజ, సిద్ధాంతం, బరటాం తదితర రెవెన్యూ గ్రామాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాల పంట భూములు నీట మునిగి పోతున్నాయి.

ప్రతీ ఏడాది నష్టమే



చిన్న వర్షం పడితే కడపలవానిగెడ్డ వద్ద వరద నీరు పెరిగిపోతుంది. పంట పొలాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ఒక్కోసారి పది, పదిహేను రోజులపాటు పంటలు నీటిలో ఉండి పోతాయి. పంటలు కుళ్లిపోయి పనికి రాకుండా పోతున్నాయి. ప్రతీ ఏడాది నష్టమే జరుగుతుంది. ఎంతో మంది నాయకులు, మంత్రులు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లిపోయారే తప్ప పరిష్కరించలేదు.

– పి.అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట


పుస్తకావిష్కరణ

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన డాక్టర్ నిక్కు అప్పన్న రాసిన 'నేను నా జన్మ భూమి బుడితి' పుస్తకావిష్కరణ కార్యక్రమం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బుడితిలో ఉన్న ప్రత్యేకతలు, చుట్టు పక్కల ఉన్న గ్రామాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకతలు, ఇక్కడ చదువుకున్న వాళ్లు ప్రస్తుతం ఏయే స్థానాల్లో ఉన్నారు, ఆలయాల విశిష్టత, పంటలు, కులాలను ప్రస్తావిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజ్ కుమార్, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ మురళి, చిన్నపిల్లల వైద్యులు ధర్మాన లక్ష్మీనారాయణ, విశ్రాంతి ప్రిన్సిపాల్ గాలి మోహన్‌రావు, విశ్రాంత వైద్యుడు మెండ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా కూరగాయల సాగు!

- ఆసక్తి చూపని రైతులు
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు
- దోచుకుంటున్న దళారులు



బిర్లంగి సమీపంలో సాగులో ఉన్న ఆకుకూరలు

ఇచ్ఛాపురం రూరల్:

కూరగాయలు, ఆకుకూరల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రైతులు అనాసక్తి చూపిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలంలోని బొడ్డబడ, బిర్లంగి, పాయితారి, కొళిగాం, ధర్మపురం గ్రామాల్లో గతంలో అధికంగా వీటిని సాగు చేసేవారు. ప్రస్తుతం పెద్దగా ఇష్టపడడం లేదు.

నిల్వ చేసే సౌకర్యం లేక..

కూరగాయల సాగు చేసే రైతులకు నిల్వ సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. పండించిన కూరగాయలు, ఆకు కూరలకు మార్కెట్‌లో సరైన ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనికితోడు ఏటా పెరుగుతున్న కూరగాయల విత్తనాల ధరలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో సాగుపై ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ సమస్య

ఈ ప్రాంతాల్లో కూరగాయల సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సమస్య వెంటాడుతోంది. ఆంధ్రాలో ఇచ్ఛాపురం తప్పా కూరగాయల కొనుగోళ్ల మార్కెట్‌లు ఎక్కడా లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో బరంపురం, ఛత్రపురం, రౌండా, జయంతిపురం, పాత్రపురం, చీకటిపేట వంటి ఒడిశా ప్రాంతాలకు రైతులు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఒడిశా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు గ్రామాల్లోనే దళారులకు అమ్ముతున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ఇచ్ఛాపురం మండలంలో సుమారు ఐదు వందల ఎకరాల్లో రైతులు కూరగాయలు పండిస్తున్నారు. ఏడాదికి ఓమారు ఉద్యానవన అధికారులు చుట్టం చూపుగా వస్తారే తప్పా అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి విత్తనాలు, నారు లభించకపోవడంతో బరంపురం వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. పురుగు మందు సైతం పొరుగు రాష్ట్రం ఒడిశా నుంచే వందల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పురుగు పోటుతో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి నష్టపరిహారం రావడంలేదంటున్నారు.

ప్రభుత్వ సాయం లేదు



ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని కాయగూరలు పండిస్తున్నాను. ఈ ఏడాది వంకాయ, క్యాబేజీ, దోస, ఆకుబుట్టాలను వేశాను. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందటం లేదు. కనీసం రాయితీపై పురుగు మందులు కూడా సరఫరా చేయడం లేదు. అధికారులు వచ్చి సూచనలు సలహాలు ఇస్తే బాగుంటుంది.

– భాస్కరశెట్టి, కూరగాయల రైతు, బొడ్డబడ

దళారులే కొంటున్నారు



మేము పండించిన పంటను అమ్ముకోవాలంటే ఒడిశా వెళ్లాల్సిందే. అందుకే దళారులు వేకువ జామున మా గ్రామానికి వచ్చి వారికి నచ్చిన ధరల్లో కొనుగోలు చేస్తారు. కూరగాయలు నిల్వ చేసేందుకు ఎటువంటి కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో దిక్కులేక దళారులు ఎంతకు కొంటే అంతకే అమ్ముకుంటున్నాము. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకునేందుకు విత్తనాలు, నారు సరఫరా చేస్తే సంతోషం

– పుణ్యా బెహరా, కాయగూరల రైతు, కొళిగాం

సందడిగా దుప్పలపాడు పాఠశాల శత వసంతాల వేడుక

- హాజరైన పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు



పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి: అక్కడ సందడి నెలకొంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు ప్రాథమిక పాఠశాల ఏర్పాటై వందేళ్లు గడచిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో పూర్వపు విద్యార్థులు, గ్రామస్థులతో శత వసంత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వందేళ్లకు గుర్తుగా పైలాన్‌ను ఆవిష్కరించారు. పూర్వపు ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి భారతి సూర్యప్రకాశ్, ఎంఈవో ఎల్.వి.ప్రతాప్, ఉప సర్పంచ్ గురువెల్లి భారతి అప్పన్న, హెచ్ఎం ఎస్.సన్యాసప్పారావు, ఆర్గనైజర్ వై.సూర్యనారాయణ, వై.నరసింహమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవలకు గుర్తింపుగా పురస్కారం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వెంకటమహేష్

పార్వతీపురం: ఉత్తమ సేవలను అందించినందుకుగాను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆర్.వెంకట మహేష్ పురస్కారం అందుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకట మహేష్‌కు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ పురస్కారం అందజేశారు.

రామవరం సర్పంచ్ జాతీయ పురస్కారం



ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ దంపతులు

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంట సత్యం నాయుడు జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా కేంద్రప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రామపంచాయతీని అభివృద్ధి చేయడంలో ప్రతిభను కనబరచడం వల్ల కేంద్ర ప్రభుత్వం రిపబ్లిక్ డే సందర్భంగా సర్పంచ్ దంపతులతో పాటు పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావును అభినందించింది.

ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావుకు రాష్ట్రస్థాయి అవార్డు



ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావు

పార్వతీపురంటౌన్: ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను అవార్డుకు ఎంపిక చేశారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఎక్సైజ్ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం: పదో తరగతి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రత్నాకరరావు సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇంటి వద్ద ప్రశాంతంగా చదువుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. టీవీలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

వీరఘట్టం: సురక్షిత ప్రయాణాలకు వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. వీరఘట్టం, నడుకూరు, విక్రమపురం, నడిమికెల్ల గ్రామాల్లో రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో వాహనదారులు పరిమిత వేగంతో రాకపోకలు సాగించాలని సూచించారు.

కిచ్చాడలో ఏనుగుల గుంపు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని కిచ్చాడ గ్రామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. దీంతో గ్రామాల్లోకి చొరబడతాయేమోనని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కిచ్చాడ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

అమ్మ తొలేళ్ల సంబరానికి సర్వం సిద్ధం

- నేడు తొలేళ్ల ఉత్సవం
- ఘనంగా కారుగేద వాలకం
- పశువులేర్లుతో గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర
- లడ్డూ ప్రసాదం సిద్ధం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ముద్దుబిడ్డ శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం జరగనుంది. జాతరకు ఇతర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. జాతరకొచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ్, ఈఓ వి.వి.సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు చేశారు.

ఘనంగా కారుగేద వాలకం

శంబర గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులు ఘనంగా కారుగేద వాలకం నిర్వహించారు. గ్రామానికి చెందిన చెల్లూరి రాములు ఉదయం నుంచి ఉపవాసం ఆచరించి, వరిగడ్డితో శరీరమంతా కప్పుకొని, యాదవవీధికి చేరుకున్న అమ్మవారి ఘటాలకు నమస్కరించారు. స్త్రీ వేషధారణలో ఓ వ్యక్తి వచ్చి రాములును అమ్మవారి ఘటాల నుంచి తీసుకువెళ్లడం ఆనవాయితీ.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

గ్రామంలోని అన్ని వీధుల్లో ఆదివారం పంచాయతీ కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. పలు మున్సిపాల్టీల నుంచి ఆదివారం 60మంది చేరుకోగా, మరో 50మంది వరకు



చదురుగుడిలో పోలమాంబ అమ్మవారు

సోమవారం చేరుకోనున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

700 మందితో పోలీస్ బందోబస్తు

జాతరలో 700మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. 41సీసీ కెమెరాలు, డ్రోన్లతో పోలీస్ ఉన్నతాధికారులు కంట్రోల్‌రూమ్ నుంచి జాతర పర్యవేక్షించనున్నారు. జాతరలో ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పీసీలు, రోప్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరకొచ్చే భక్తుల అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా రోడ్డుమ్యాప్‌ను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన భక్తులు 100 నంబర్‌కు ఫోన్ చేస్తే, రూట్ పెట్రోలింగ్ పార్టీ చేరుకొని, ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారు.

30వేల లడ్డూ ప్రసాదం సిద్ధం

శంబర పోలమాంబ అమ్మవారి జాతర 10 వారాల పాటు జరగనుంది. తొలి జాతరకు వచ్చే భక్తులకు 30వేల లడ్డూ ప్రసాదం, అవసరమైన మేరకు పులిహోర ప్రసాదాన్ని తయారుచేయించారు. ఉచితం, 20, 100 రూపాయిల టిక్కెట్లు ద్వారా అమ్మవారిని దర్శించుకునే భక్తులకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతరలో దేవదాయ శాఖ సిబ్బంది 60మంది వరకు విధులు నిర్వహించనున్నారు. భక్తుల కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు, దుస్తులు మార్చిడి గదులు నిర్మించారు. క్యూలైన్లు వద్ద చిన్నారులుకు పాలు అందించనున్నారు. మంచినీరు అందుబాటులో ఉంచారు.

ఐదు చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు

శంబర గ్రామానికి చేరుకునే వాహనదారులకు ఐదు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. మక్కువ నుంచి కవిరిపల్లి గ్రామం మీదుగా శంబర గ్రామానికి కేవలం ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. మిగిలిన ఆటోలు, ఇతరత్ర వాహనాలను మక్కువ మీదుగా చెముడు గ్రామం నుంచి శంబర చేరుకోవాల్సి ఉంది. సన్యాసిరాజపురం, కవిరిపల్లి, తోటవలస గ్రామాలలో ముత్యాలమ్మ పండగ జరగనున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు బంధువులు చేరుకోవాలంటే పోలీసులు అనుమతితో వెళ్లనున్నారు. కవిరిపల్లి మీదుగా శంబర చేరుకున్న వాహనదారులకు శంబర పీహెచ్‌సీ పక్కన, చెముడు మీదుగా చేరుకున్న వాహనాలకు గోముఖీ నది వద్ద, మామిడిపల్లి మీదుగా వచ్చే వాహనాలు వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ వద్ద, మావుడి నుంచి చేరుకునే వాహనాలు హాస్టల్ వద్ద, ఎస్.పెద్దవలస మీదుగా వచ్చే వాహనాలకు గ్రామ శివారులో స్థలాలను కేటాయించారు.

గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కార్యక్రమానికి అవసరమైన సిరిమాను, గుజ్జుమాను కర్రలను ఆదివారం రైతులు పశువులేర్లుతో గ్రామానికి తీసుకువచ్చారు. సాలూరు మండలం కందులుపదం గ్రామానికి చెందిన రైతులు తీళ్ల అచ్యుతరావు, సిద్ధయ్య పొలంలో సిరిమాను కర్రను గుర్తించారు. సుమారు 35 అడుగుల పొడవు సిరిమాను కర్రను తీసుకువచ్చారు.

అమ్మవారి ఘటాలకు భక్తుల పూజలు

చదురుగుడిలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 3.30గంటల సమయంలో చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలు గ్రామంలోకి తిరువీధికి బయల్దేరగా, భక్తులు అమ్మవారి ఘటాలకు, పాలధారకు పూజలు నిర్వహించారు.



పశువులేర్లుతో తీసుకువస్తున్న సిరిమాను కర్ర

మన్యంలో మరో చిన్నారి మృతి

శృంగవరపుకోట: మన్యంలో మృత్యుఘోష ఆగడం లేదు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యమో, గిరిజనం శాపమో కానీ చిన్నారులు ప్రాణాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. ఆదివారం మండలంలోని గిరిశిఖర గ్రామంలో మరో చిన్నారి తనువు చాలించాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుని తల్లిదండ్రులు చిన్నాలమ్మ, దేవా, ఏపీ గిరిజన సంఘ నాయకులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో దారపర్తి పంచాయతీ చిలకపాడు గ్రామానికి చెందిన ఏడాది వయస్సున్న బాలుడు జన్ని విజయ్‌కు ఇటీవల టీకా వేయించారు. తర్వాత బాలుడికి జ్వరం రావడంతో కొండ కింద ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చి వైద్యం చేయించారు. వైద్యులు విజయనగరం ఘోషాఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో తీసుకెళ్లి వైద్యం చేయించారు. శనివారం సాయంత్రం వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో గ్రామానికి తీసుకొచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో చిన్నారి విజయ్ మరణించాడు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదం అలుముకుంది. వైద్యసిబ్బంది గ్రామాల్లోకి రాకపోవడం వల్లనే తమకు ఈ పరిస్థితి వస్తోందని గిరిజనులు చెబుతున్నారు.

శంబర జాతర సందర్భంగా 130 ప్రత్యేక బస్సులు

- జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 130 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.పార్వతీపురం, సాలూరు, పాలకొండ, విజయనగరం, ఎస్‌కోట, శ్రీకాకుళం-2 డిపోల నుంచి శంబర వరకు వయా చినభోగిలి, దిబ్బగుడివలస, మామిడిపల్లి, వైమిస్ వలస మీదుగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 27వ తేదీన పార్వతీపురం డిపో నుంచి 5బస్సులు, సాలూరు డిపో నుంచి 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28వ తేదీన



జిల్లా ప్రజా రవాణా అధికారి కె. శ్రీనివాస్

పార్వతీపురం నుంచి శంబర 25 బస్సులు, సాలూరు నుంచి శంబర 25 బస్సులు, రాజాం నుంచి శంబర 10 బస్సులు, బొబ్బిలి నుంచి శంబర 20 బస్సులు, విజయనగరం నుంచి శంబర 20 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. 29వ తేదీన పార్వతీపురం నుంచి శంబర 5 బస్సులు, సాలూరు నుంచి శంబర 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. భక్తులంతా ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని కోరారు.

క్రీడా మైదానానికి శంకుస్థాపన

పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడ గ్రామంలో క్రీడా మైదానం నిర్మాణానికి సర్పంచ్ కోట్ల రాము నాయుడు ఆదివారం శంకుస్థాపన చేసారు. తమ సొంత నిధులు రూ.25 లక్షలతో మైదానానికి వివిధ రకాలు పనుల నిమిత్తం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 20 అడుగుల లోతులో వున్న గోతులను కప్పి మైదానం పనులు చేస్తున్నట్లు తెలిపారు. లోతును పూడ్చడానికి సుమారు 3 వేలు లోడులు మట్టితో నింపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలియజేసారు. కొవ్వాడ గ్రామంలో క్రీడా మైదానం నిర్మాణం గ్రామస్తులు కలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేబార్కి అప్పారావు, కల్యాణపు హరిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

30న మరియగిరి యాత్ర



నవదిన పూజల్లో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

- ప్రారంభమైన నవదిన పూజలు

వీరఘట్టం: మండల సమీపంలోని వెంకమ్మచెరువుకు ఆనుకున్న ఉన్న కొండపై వెలిసిన మరియగిరి జాతర ఈ నెల 30న నిర్వహించనున్నారు. ఇందుకోసం యాత్రా ప్రాంగణంలో జరగబోయే దివ్య పూజ కోసం ప్రార్థనా మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ మేరకు ఉత్సవానికి తొమ్మిది రోజుల ముందు నుంచి చేపట్టబోయే నవదిన పూజలు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవదిన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన పూజల్లో వీరఘట్టం, చిట్టిపూడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురు మండలాల పీఠాధిపతులు పాల్గొన్నారు. 30వ తేదీ ఉదయం నడుకూరు ఆర్‌సీఎం చర్చి నుంచి మరియగిరి శిఖరం వరకు మేరీమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి, దివ్య పూజను చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 30 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలందుకుంటున్న మేరిమాత

ఏర్పాట్లు పూర్తి..

ఈ నెల 30న జరగనున్న మేరీమాత ఉత్సవం కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నడకదారిలో అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఈ నెల 29 వరకు నవదిన పూజలు జరుగుతాయి. – విజయ్‌రెడ్డి, ఫాదర్, మరియగిరి

రెండు పశువుల లారీల సీజ్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారి గుండా అక్రమంగా రెండు లారీలతో తరలిస్తున్న 19పశువులను శనివారం రాత్రి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసును నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు.

గిరిజన రైతులకు రూ.10 లక్షల స్ప్రింక్లర్ యూనిట్ల పంపిణీ

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల సంస్థ, ఐటీడీఏ భాగస్వామ్యంతో కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని 10 మంది గిరిజన రైతులకు రూ.10.05 లక్షల విలువ గల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను (డ్రిప్, స్ప్రింక్లర్స్)ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం ఐటీడీఏ కార్యాలయంలో పంపిణీ చేశారు. 2024-25వ సంవత్సరంలో సూక్ష్మ నీటిపారుదల పథకం కింద 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్, స్పింకర్స్ యూనిట్లను ఉద్యాన వ్యవసాయ రైతులకు రాయితీపై అందజేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్స్ యూనిట్స్ కలిగిన వాహనానికి పీఓ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ ఎంఐపీ, ఐటీడీఏ సౌజన్యంతో ఈ పథకం కింద 750 స్పింకర్ల యూనిట్లను రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వి.రాధాకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానవన శాఖాధికారి కె.మణి భూషణరావు, మండల సూక్ష్మ నీటిపారుదల అధికారి శాంతిస్వరూప్, డీసీఓ కిశోర్, ఇతర ఏపీఎంఐపీ, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు రూ.10 లక్షల స్ప్రింక్లర్ యూనిట్లు పంపిణీ

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల సంస్థ, ఐటీడీఏ భాగస్వామ్యంతో కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని 10 మంది గిరిజన రైతులకు రూ.10.05 లక్షల విలువ గల బిందు, తుంపర్ల సేద్య పరికరాలను (డ్రిప్, స్ప్రింక్లర్స్)ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం ఐటీడీఏ కార్యాలయంలో పంపిణీ చేశారు. 2024-25వ సంవత్సరంలో సూక్ష్మ నీటిపారుదల పథకం కింద 1,800 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్, స్పింకర్స్ యూనిట్లను ఉద్యాన వ్యవసాయ రైతులకు రాయితీపై అందజేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్స్ యూనిట్స్ కలిగిన వాహనానికి పీఓ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ ఎంఐపీ, ఐటీడీఏ సౌజన్యంతో ఈ పథకం కింద 750 స్పింకర్ల యూనిట్లను రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వి.రాధాకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానవన శాఖాధికారి కె.మణి భూషణరావు, మండల సూక్ష్మ నీటిపారుదల అధికారి శాంతిస్వరూప్, డీసీఓ కిశోర్, ఇతర ఏపీఎంఐపీ, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్ప్రింకర్ యూనిట్లు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలి



పట్టణంలో నిరసన తెలుపుతున్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

పార్వతీపురంటౌన్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వెళ్తే తీవ్రపరిణామాలు తప్పవని హెచ్చరించారు. రైతు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. దొడ్డి దారిన అమలుకు పూనుకున్న రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎం.ఎస్ స్వామి నాథన్ సిఫార్స్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి వేతనం, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం చేయాలనీ కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వమే సమర్థవంతంగా నడపాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు బుడితి అప్పల నాయుడు, మోనంగి భాస్కర రావు, బొత్స నర్సింగరావు, పి.సంగం, పాలక రంజిత్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, నాయకులు రెడ్డి వేణు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోలా రమణి సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పెదలా భాస్కర్ రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు వై. మన్మథరావు, బీవీ రమణ, గ్రామీక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.ఇందిర, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ జిల్లా నాయకుడు విశ్వేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్ లైన్స్ రహదారి ఏర్పాటుకు చర్యలు

రామభద్రపురం: శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి వయా రాజాం, బాడంగి, రామభద్రపురం, పార్వతీపురం మీదుగా రాయఘడ వరకు ఫోర్ లైన్స్ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు నుంచి రాజాం వైపు రహదారిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లిమర్ల నుంచి రామతీర్థం మీదుగా రణస్థలం వరకు విస్తరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రవాణా సౌకర్యం కల్పనే లక్ష్యంగా రహదారులు విస్తరణ చేయనుందని తెలిపారు. రహదారులు విస్తరణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ ఘట్కారీకి విన్నవించగా ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫీజుబిల్టీ కూడా ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో కొన్నింటిని అమలు చేస్తోందని, మిగిలిన పథకాల అమలుపై దృష్టి సారిస్తుందన్నారు.

శ్రమదానంతో రోడ్లు వేసుకుంటున్న గిరిజనులు

సాలూరు: కూటమి ప్రభుత్వంలో వంద రోజుల్లో వంద రోడ్లు, ముమ్మరంగా అభివృద్ధి పనులు అంటూ ఆర్భాటాలు చేస్తున్న నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు పక్కనపెడితే, గిరిశిఖర గ్రామాల్లో గిరిజనులు శ్రమదానంతో రోడ్లు వేసుకుంటున్న పరిస్థితి. స్వయానా గిరిజనసంక్షేమశాఖామంత్రి, స్త్రీశిశుసంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోనే సాలూరు మండలం కొదమ పంచాయతీలో గల చింతామల గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్నారు. గిరిశిఖర చింతామల నుంచి సమీప ఒడిశా రాష్ట్రం శబ్కుమారి వరకు సుమారు మూడున్నర కిలోమీటర్లు శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషితో పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు సమీపం రోడ్డు నుంచి లొద్ద వరకు రోడ్డు మంజూరుచేసి పనులు చేపట్టారు.లొద్ద నుంచి చింతామలకు సుమారు 5 కి.మీ.దూరం ఉంది. ఇదంతా పూర్తిగా అటవీప్రాంతం. అయితే తమకు ఎప్పటికీ రోడ్డు పూర్తికాకపోవడంతో ఇటు ఆంధ్రా కంటే అటు వైపు దగ్గరగా ఉన్న ఒడిశా వైపు రోడ్డు వేసుకోవాలని గిరిజనులు భావించారు. ఈ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణం చేస్తుందన్న నమ్మకంలేని గిరిజనులు శ్రమదానంతో చింతామల నుంచి శబ్కుమారికి రోడ్డును వేసుకుంటున్నారు. అటవీమార్గంలో రాళ్లు, రప్పలు, కొండలు దొలచి, చెట్లు, మొక్కలను తొలగించి రోడ్డును వేసుకున్నారు. కొదమ పంచాయతీలో పీసా ఎన్నికలు కూడా జరగలేదని స్థానిక గిరిజనులు తెలుపుతూ మా హక్కులను కోల్పోతున్నామని వాపోతున్నారు. అధికారులు, ఈ కూటమి ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్న గిరిజనులు

నాయకులతో ఆత్మీయ సమావేశం

బలిజిపేట: పార్టీ అధికారంలో లేకపోయినా, తన గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు నా ఆత్మీయులేనని, మీ అందరి ఆదరణ మరవలేనిదని దానిని అదృష్టంగా భావిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను గ్రామస్థాయిలో కలిసి వారితో మమేకమై, అందరం కలిసి రానున్న రోజులలో పార్టీకి అండగా నిలిచేందుకు అడుగులు ముందుకు వేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. భవిషత్ కార్యాచరణపై చర్చించారు. మనస్పర్ధలు మాని అందరం కలిసి, మెలిసి ఉండాలని కోరారు. పార్టీ అధినేత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేర పార్టీని నడిపించుకోవాలని సూచించారు.

మేధావి వర్గం అధ్యక్షుడికి సన్మానం

వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా మేధావి వర్గం అధ్యక్షుడిగా నియమితులైన పోరాన శ్రీరామచంద్ర నాయుడు(పీఎస్ఆర్ నాయుడు)ను మాజీ ఎమ్మెల్యే జోగారావు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.



పీఎస్ఆర్ నాయుడును సన్మానించిన మాజీ ఎమ్మెల్యే, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్టీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

చిలకలపల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ఎస్.వాసుదేవరావు తల్లి సత్యవతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు నివాళులర్పించి వాసుదేవరావు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.